సాక్షి ఒడిశా

ఆదివారం ၊ 1 ၊ జూన్ ၊ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,81,206లు, బంగారం 20 మిల్లీగ్రాములు, వెండి 56గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కల్యాణం.. కమనీయం

శైవ క్షేత్రాల్లో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- 8లో



వైభవంగా శీతలషష్టి

పర్లాకిమిడిలో శీతల షష్టి వైభవంగా జరిగింది. విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

- 8లో

న్యూస్‌రీల్

బావిలో పడిన ఎలుగు సురక్షితం



బావిలో చిక్కుకున్న ఎలుగుబంటి

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా బరిపద అటవీ మండలం కప్తిపడా రేంజ్‌లోని పాడుబడిన బావిలో ఓ ఎలుగు బంటి పడిపోయింది. బావిలో చిక్కుకున్న ఎలుగుబంటిని తక్షణ స్పందన బృందం (ఆర్‌ఆర్‌టీ) సురక్షితంగా రక్షించిందని అధికారులు ప్రకటించారు. బావి నుంచి సురక్షితంగా బయటకు తీసిన ఎలుగు బంటిని బోనులో సురక్షితంగా ఉంచారు. ఎలాంటి హాని జరగలేదని తెలిపారు. శనివారం వేకువ జామున గ్రామం పొలిమేరల్లో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్తుల దృష్టికి వచ్చింది. దీనిని వెంబడించే సరికి పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడింది. గ్రామస్తుల నుంచి ఈ సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సహాయక చర్యల్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు సమీపంలోని ప్రజలు గుమిగూడారు.

చీఫ్ ఇంజినీర్ బైకుంఠ నాథ్ షడంగి అరెస్టు



బైకుంఠ నాథ్ షడంగి

భువనేశ్వర్: రాష్ట్ర ఆర్ డబ్ల్యూ చీఫ్ ఇంజినీర్ బైకుంఠ నాథ్ షడంగిని ఒడిశా విజిలెన్స్ అరెస్టు చేసింది. అధికారిక ఆదాయానికి మించి అపరిమిత ఆస్తుల ఆర్జన ఆరోపణ కింద నమోదు చేసిన కేసులో అరెస్టు చేసి జైలుకు తరలించారు. అంతకు ముందు చేపట్టిన ఆస్తుల సోదా దాడుల్లో నిందిత బైకుంఠ నాథ్ షడంగి ఆదాయానికి మించి 483 శాతం అధికంగా ఆస్తులు ఆర్జించినట్లు తేలింది. ఈ సోదాల్లో రూ. 2.56 కోట్లకు పైగా నగదు, 2 బహుళ అంతస్తుల భవనాలు, 2 ఫ్లాట్లు, 7 ఇళ్ల స్థలాలు, రూ.1.5 కోట్ల డిపాజిట్లు, రూ. 2.7 కోట్ల షేర్ పెట్టుబడులు, 1.141 కిలోల బంగారం మొదలైనవి బయటపడ్డాయి.

గంజాయి మాఫియాకు గట్టి షాక్



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

జయపురం: జయపురం పట్టణ పోలీసులు గంజాయి మాఫియాకు గట్టి షాక్ ఇచ్చారు. గంజాయిని దొంగతనంగా తరలించేందుకు సిద్ధమవుతున్న సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి 1318 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు పట్టణ పోలీసు అధికారి ఉల్లాస్ చంద్ర రౌత్ నేడు వెల్లడించారు. గంజాయితో పాటు 120 బస్తాల తవుడు, నాలుగు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1 కోటి 30 లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టయిన వారు జయపురం సమితి టంకువ పంచాయతీ బమణగాం దుర్గా బహదూర్(35), కుసుమగుడ వాసి మీనా బారిక్(35)లు అని వెల్లడించారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా బెయిల్ మంజూరు కాకపోవటంతో వారిని జైలుకు తరలించినట్లు వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. ఈ నెల 29వ తేదీన సబ్‌ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర పంగి, ఏఎస్‌ఐ రమేష్ చంద్ర మహాపాత్రో తమ సిబ్బందితో పెట్రోలింగ్ జరుపుతున్నారు. స్థానిక హటపాదర్ (సంత తోట) ప్రాంతంలో ఉన్న రెండు షోరూంల మధ్య గల సందులో నుంచి ఇద్దరు వ్యక్తులు పరుగెత్తుకుంటూ వెళ్లడం పోలీసులకు కనిపించింది. అనుమానం వచ్చి వారిని వెంబడించారు. షోరూంల వెనుక ఉన్న ఒక కవాడి దుకాణం(పాత సామానులు కొనే దుకాణం) ముందు దాదాపు 12 మంది నిలుచుని ఉన్నారు. వారు బస్తాలు తీసుకు వస్తూ ఒక ట్రక్కులో లోడ చేస్తున్నారు. వారిలో పట్టణ ప్రాంతంలోను, సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో కొంతమంది నేరస్తులు ఉండటం కనిపించింది. వారు పోలీసు అధికారులను, పోలీసు సిబ్బందిని చూసి పారిపోయారు. వారిని పోలీసులు వెంబడించారు. పారిపోతున్న వారిలో ఇద్దరు పోలీసులకు పట్టుబడగా మిగతా వారు పరారయ్యారు. వారిని అరెస్టు చేసి విచారించగా వారు తమతో ఉన్న వారి పేర్లను వెల్లడించారని పోలీసు అధికారి వెల్లడించారు. రెండు ట్రక్కులను తనిఖీ చేయగా అందులో 4 టన్నుల తవుడు ఉండగా వాటి కింద 259 గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయని, వాటిని మెజిస్ట్రేట్ సమక్షంలో తూయించగా అవి 1318 కిలోలు ఉన్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బురదల పోలమ్మ .. ఉత్సవాలకు సిద్ధం



అమ్మవారి మందిరం



నిప్పులపై పూజారి నడక (ఫైల్)



అమ్మవారిని ముస్తాబు చేస్తున్న పూజారులు

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- చురుగ్గా ఏర్పాట్లు

రాయగడ: పట్టణ ప్రజల ఆరాధ్య దైవం బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాలు జూన్ 11తో ముగుస్తాయి.

ఉత్సవ కమిటీ ఏర్పాటు

ఉత్సవాలను నిర్వహించేందుకు అందరి సమక్షంలో ఏర్పాటైన కమిటీలో అధ్యక్షులుగా బార్ణి జగన్ మోహన్ రావు, ఉపాధ్యక్షుడిగా ఎద్దు శ్రీహరి, కార్యదర్శిగా జె.శివాజి, కన్వీనర్‌గా కింతలి శ్రీనివాస్ రావు, కోశాధికారిగా బొత్స శ్రీనివాస్ రావు, సహ కోశాధికారిగా టెంటు వెంకటేష్‌లు ఉన్నారు.

చాటింపు

ఉత్సవాలపై అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ డప్పు వాయిద్యం మధ్య ఊరిబారికి ఈ చాటింపు వేశారు. చాటింపు కార్యక్రమం విన్న వారు ఒకవేళ ఏదైనా పనిమీద బయట ఊరు వెళితే అనుపు పండగ రోజు (ఉత్సవాల ముగింపు రోజు) న తిరిగి రావాలన్నది సంప్రదాయం.

ఉజ్జిడి బండి

చాటింపు కార్యక్రమం అనంతరం ఆదివారం తెల్లవారున ఉజ్జిడి బండి ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. వెదురుతో రూపొందించిన బుట్టను ఒక బండిలో ఏర్పాటు చేసి వేకువ జామున బండిని పురవీధుల్లో తిప్పుతారు. ఈ సమయంలో ప్రజలు రాత్రి ఉంచిన చద్దన్నం బుట్టలో వేస్తారు. ఇలా సేకరించిన చద్దన్నాన్ని స్థానిక రాణిగుడఫారంలో గల డీఎఫ్ఓ కాలనీలో (ఏనుగుల శాల) వద్ద పడేస్తారు. ఈ ఉజ్జిడి బండిలో చద్దన్నం వేస్తే కుటుంబం సుఖశాంతులతో ఉంటుందని నమ్ముతారు.

ఉత్సవ విశేషాలు

సోమవారం నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి ఉత్సవాల్లో అదేరోజు సాయంత్రం ఆదివాసీ మేళతాళాలతొ పట్టణ ప్రజలు, ప్రముఖులు అమ్మవారి పాదాలను తీసుకువచ్చేందుకు వెళతారు. స్థానిక భైరవీధిలొ గల దొర ఇంటి నుంచి తీసుకువచ్చిన పాదాలను అమ్మవారి మందిరంలో ఏర్పాటు చేస్తారు. అనంతరం స్థానిక ట్రెజరీ వద్ద అమ్మవారి ఘటాలను తీసుకువస్తారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు ఊరేగింపు, పాలదార, అసర్లు, నాయుడు,నాయురాళ్ల విత్తనాలు వేయడం, అంజలి రథం వంటివి ఉంటాయి.



ఉత్సవ కమిటీ సందడి



అమ్మవారి అన్నదమ్ముడు దువ్వేర పోతన మందిరం



రూపొందుతున్న వెండి మకర తోరణం

సంప్రదాయాలకు ప్రతీక..



పూర్వీకులు అందించిన సంప్రదాయాలకు ప్రతీకగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. అందరి సహకారంతో ఉత్సవాలు ఈసారి కూడా వైభవంగా జరిగేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అనుపోత్సవాలకు లక్షల మంది వస్తారు. అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

– బార్ణి జగన్ మోహన్ రావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

అందరి సహకారంతో..



ఉత్సవాలకు ప్రజల సహకారం ఉంటుంది. వారికి తోచిన సహకారం అందిస్తుండడంతో ఉత్సవాలు ఏటా ఘనంగా జరుగుతున్నాయి. అందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తాం.

– ఎద్దు శ్రీహరి, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు

రూ.15 లక్షలతో ఉత్సవాలు



ఈ ఏడాది ఉత్సవాలకు రూ.15 లక్షలు ఖర్చవుతుందని భావిస్తున్నాం. అందుకు అనుగుణంగా ప్రజలు సహకరిస్తున్నారు. సంప్రదాయాలకు ప్రతీకగా ఈ ఉత్సవాలను ఏటా నిర్వహిస్తున్నాం. నిధులు మిగిలితే ఆలయ అభివృద్ధికి వినియోగిస్తున్నాం.

– బొత్స శ్రీనివాస్ రావు, ఉత్సవ కమిటీ కోశాధికారి

పూరీ రథయాత్రకు 1000 ప్రత్యేక బస్సులు



అమితాబ్ ఠాకూర్, రవాణా కమిషనర్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని రథ యాత్ర సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పూరీకి 1,000 కి పైగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా బస్సు యజమానుల సంఘం కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో కటక్ నగర డీసీపీ, పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, రాష్ట్ర రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. సాధారణ ప్రయాణికుల బస్సులతో పాటు వివిధ వాహనాలకు ప్రత్యేక పర్మిట్లు జారీ చేస్తారు. మాలతీపట్టపూర్, తొలబొణియా మైదానాల్లో ప్రత్యేక బస్సులు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తారు. అక్కడి నుంచి భక్తులను రథ యాత్ర జరిగే బొడొదండొ ప్రాంతానికి తరలించేందుకు బ్యాటరీతో నడిచే ఆటోల్లో తరలిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా 100 ఆటోలు అందుబాటులో ఉంచుతారు. యాత్రికుల నుంచి ప్రభుత్వం నిర్ధారించిన ధర కంటే ఎక్కువ వసూలు చేయవద్దని బస్సు, ఆటో వర్గాలకు సూచించారు. తొలబొణియా బస్ స్టాప్‌లో భక్తులకు సులభంగా రూ. 10 నామమాత్రపు ధరకు స్వచ్ఛమైన శాఖాహార భోజనం సౌకర్యం కల్పిస్తారు.

వాహనాల రద్దీ నియంత్రణకు చర్యలు

శాంతిభద్రతల నిర్వహణలో భాగంగా దాదాపు 30 ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లను మోహరించనున్నారు. వాహనాల రద్దీ నియంత్రణకు జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తుంది. భువనేశ్వర్ - పూరీ, పూరీ - కోణార్క్, పిప్పిలి - పూరీతో సహా కీలక మార్గాల్లో వాహనాల రవాణాకు అంతరాయం లేకుండా దారి పొడవునా నియంత్రణ వ్యవస్థ చురుకుగా పని చేస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్ధారించిన ధరలకే చార్జీలు వసూలు చేసేందుకు బస్సు యజమానులు అంగీకరించారని రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్ తెలిపారు.

• సమాజానికి పొగ

ప్రపంచ పొగాకు నివారణ దినం పురస్కరించుకుని సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో ఈ సైకత శిల్పం తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పొగాకు వ్యసన పరులకు మాత్రమే హాని కలిగించదని, కుటుంబాలను, యావత్ సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. అలవాటు కంటే ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పించేందుకు పొగాకు నివారిద్దామని పిలుపునిచ్చారు.

- భువనేశ్వర్



పాములా అమ్మాయి ప్రవర్తన



నడి రోడ్డు మీద పాములా విన్యాసాలు ప్రదర్శిస్తున్న అమ్మాయి

భువనేశ్వర్: మయూరభంజ్ జిల్లాలోని ఒక గ్రామంలో ఇటీవల ఒక అమ్మాయి ప్రవర్తన పామును పోలినట్లు ఉండడంతో అంతా దిగ్భ్రాంతి చెందారు. మయూరభంజ్ జిల్లా ఉదొలా మండలం చకరపాల్ గ్రామం నడి రోడ్డు మీద ఓ అమ్మాయి పాములా పాకుతూ పడగ విప్పి బుసలు కొడుతున్న దృశ్యం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఘటన పూర్తి వివరాల్లోకి వెళితే .... ఇటీవల మయూరభంజ్ జిలా ఉదొలా మండలం చకరపాల్ గ్రామంలోని రవీంద్ర సింగ్ ఇంట్లోకి ఒక విషపూరిత పాము ప్రవేశించింది. అది నాగు పాముగా గుర్తించి యజమాని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశాడు. వారు వెంటనే స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులకు ఫోన్ చేసి సహాయం కోరారు. సమాచారం అందుకున్న స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులు ఇంటికి చేరుకుని పామును పట్టుకోవడానికి ప్రయత్నించారు. పాము చొరబడిన మట్టి గోడను వారు కొద్దిగా పగలగొట్టడం ప్రారంభించగానే, రవీంద్ర సింగ్ కూతురు మీనాక్షి అకస్మాత్తుగా నేలపై కుప్పకూలిపోయి బుసలు కొడుతూ, నేలపై దొర్లుతూ, పాములా ప్రవర్తించడం చూసిన వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతే కాకుండా తనను అక్కడి నుంచి తీసుకెళ్ల వద్దని, తనకు హాని చేయవద్దని దీనంగా అందరినీ వేడుకుంది. కొన్ని రోజుల కిందట ఆ కుటుంబం దృష్టిలో ఒక పాము తారస పడింది. వారు దాన్ని చాలాసార్లు కొట్టడానికి విఫలయత్నం చేశారు. పాము ఎలాగోలా తప్పించుకుంది. అయితే ఆశ్చర్యకరంగా ఆ అమ్మాయి శరీరంపై పాముకు కర్రతో కొట్టిన గుర్తులను పోలిన గుర్తులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మీనాక్షి గతంలో నాగ పంచమి, వసంత పంచమి వంటి పవిత్ర సందర్భాలలో కూడా పాములా ప్రవర్తించిందని వారు చెబుతున్నారు.

బాల్య వివాహం నిలిపివేత



ఇరుకుటుంబాలతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో బాల్య వివాహాన్ని స్థానిక సీడీపీవో అడ్డుకున్నారు. బొయిపరిగుడ సమితి కోలనీగుడ గ్రామంలో బాల్య వివాహం జరిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో సీడీపీవో సబిత బ్రహ్మ సమితి అధికారులు, పోలీసులతో శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. వివాహానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకొని బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు బొరిగుమ్మ సమితి కెందుపడ ప్రాంతంలో +2 చదువుతున్న బాలికకు బొయిపరిగుడ ప్రాంతం కోలనీగుడలో 17 ఏళ్ల బాలుడుతో వివాహం నిర్ణయించారు. కొద్దిరోజుల కిందట బాలికను పెండ్లి కుమారుడు తమ ఇంటికి తీసుకొచ్చారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం బాలికకు అక్కడ పెళ్లి చేస్తుండగా విషయం విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుసుకున్న సీడీపీవో సబితా బ్రహ్మ సమితి అధికారులు, పోలీసులతో చేరుకొని ఉభయ వర్గాల వారిని సమావేశ పరిచారు. బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని, చిన్న వయసులో పెళ్లితో అనేక అనర్థాలు ఉంటాయని వివరించారు. తొలుత వారు అంగీకరించలేదు. బాల్య వివాహాలపై వివరించి అవగాహన కల్పించడంతో పెళ్లి నిలిపేసేందుకు సమ్మతించారు. అమ్మాయికి 18 , అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేసేందుకు నిర్ణయించారు. ఉభయవర్గాల సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నందినీ స్వైన్, కెందుపడ అంగన్‌వాడీ వర్కర్ మధుస్మిత ధల్, బొయిపరిగుడ అంగన్‌వాడీ వర్కర్ తులసీ చలాన్, బొయిపరిగుడ పోలీసు కానిస్టేబుల్ కౌశల్య రొంధారి పాల్గొన్నారు.

రేపటి నుంచి కేంద్రీయ విద్యాలయంలో దరఖాస్తుల విక్రయం

- 30 వరకూ దరఖాస్తుల స్వీకరణ



జయపురం కేంద్ర విద్యాలయ ప్రధాన గేటు

జయపురం: జయపురం కేంద్రీయ విద్యాలయం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. దీంతో ఇందులో చేరేందుకు ఆసక్తి ఉన్న వారి కోసం జూన్ నెల రెండో తేదీ సోమవారం నుంచి దరఖాస్తులను విక్రయించనున్నారు. ఈ విషయాన్ని విద్యాలయం కొరాపుట్ ప్రిన్సిపాల్ ఎస్.కె.దాస్ శనివారం వెల్లడించారు. జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అయితే జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్‌తో చర్చించిన తరువాత ఎన్ని రోజులు దరఖాస్తు ఫారాలను విక్రయించాలో నిర్ణయిస్తామన్నారు. ఇదిలా ఉండగా జయపురం కేంద్ర విద్యాలయ ప్రిన్సిపాల్‌గా నయాగుడ కేంద్ర విద్యాలయంలో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడుని నియమించినట్లు తెలిసింది. జయపురంలో కేవీకే ఏర్పాటు చేయాలని అనేక సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాయి. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీ పతి , కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తీసుకు రావడంతో ఎట్టకేలకు విద్యాలయం మంజూరైంది.

పొగాకు, గంజాయికి దూరంగా ఉండాలి

- డాక్టర్ ఆనంద్ సామంతరాయ్



సభలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు

పర్లాకిమిడి: విద్యార్థులు పొగాకు, గంజాయి, నల్లమందు, ఛరస్ వంటి మత్తునిచ్చే వాటికి దూరంగా ఉండాలని జిల్లా ఆదనపు వ్యాధుల కంట్రోల్ అధికారి డాక్టర్ ఆనంద్ సామంతరాయ్ అన్నారు. పర్లాకిమిడిలో శనివారం ఉదయం మెడికల్ నుంచి రాజవీధి, బస్టాండు వరకూ నర్సింగ్ ట్రెనింగ్ విద్యార్థినులు, ఆశ వర్కర్ల ర్యాలీని సీడీఎంవో డాక్టర్ మహమ్మద్ ముబారక్ అలీ ప్రారంభించారు. ర్యాలీ అనంతరం సీడీఎంవో సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. పొగాకు సేవించడం వల్ల కలిగే అనర్థాలను ఫుడ్ సెక్యూరిటీ అధికారి తపస్వినీ నాయక్ వివరించారు. ఏ వస్తువు కొన్నా ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించాలని, ప్లాస్టిక్ సంచులు తీసుకోరాదని అన్నారు. పొగాకు, క్యాన్సర్‌పై ఆదనపు పీహెచ్‌వో డాక్టర్ ఇందిరా కుమారీ మహాపాత్రో, డాక్టర్ నయన్ మల్లిక్ తదితరులు మాట్లాడారు. ఆశ వర్కర్ల మేనేజర్ నారాయణ మల్లిక్, అసిస్టెంటు మేనేజర్ సూర్యకాంత మిశ్రా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆనంద్ సామంతరే

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: జిల్లా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. అనంతరం టెక్కలి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ శాలిపేట గ్రామానికి చెందిన చలపాక తారకేశ్వరరావు (39)గా గుర్తించినట్లు తెలిపారు. మద్యానికి బానిసై నిత్యం తాగుతూ ఉంటాడని, శరీరం డీహైడ్రేషన్‌కు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం


బోల్తాపడిన కారు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం శ్రీపురం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఓ కారు బోల్తాపడింది. ఒడిశాకు చెందిన ఏడుగురు వ్యక్తులు దైవ దర్శనానికి విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీపురం సమీపంలో అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రూ.23,700 విలువైన కలప స్వాధీనం


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

ఎచ్చెర్ల: ప్రాంతీయ నిఘా అమలు అధికారి బి.ప్రసాదరావు ఆదేశాల మేరకు లావేరు మండలం బెజ్జిపురం జంక్షన్ వద్ద విజిలెన్స్, అటవీశాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రణస్థలం మండలం చిల్లపేట గ్రామానికి చెందిన సిల్లా శంకరరావు అటవీశాఖ అనుమతులు లేకుండా బుడతవలస నుంచి చిల్లపేటకు అక్రమంగా తరలిస్తున్న రూ.23,700 విలువైన అకేషియా కలప దుంగలను పట్టుకున్నారు. అనంతరం బొలెరో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా కలపను తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రామారావు, సిబ్బంది ఈశ్వరరావు, కన్నబాబు, అటవీశాఖ అధికారులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

23 కేజీల గంజాయి సీజ్


సీజ్ చేసిన గంజాయిని చూపుతున్న అదనపు ఎస్పీ, సీఐ

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 23 కేజీల 800 గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనలో పర్లాకిమిడికి చెందిన ముక్తా పరిషా, కటక్‌కు చెందిన రత్నాకర్ జెన్నాలను అరెస్టు చేశారు. శనివారం నరసన్నపేట సర్కిల్ స్టేషన్‌లో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మడపాం టోల్‌గేట్ వద్ద శనివారం ఉదయం , మధ్యాహ్నం వేర్వేరుగా నరసన్నపేట పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముక్తా పరిషా అనే మహిళ మూడేళ్ల బిడ్డతో 10 కేజీల గంజాయిని పర్లాకిమిడి నుంచి చెన్నైకి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆమెతో ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడు. అలాగే కటక్ నుంచి హైదరాబాద్‌కు రత్నాకర్ అనే వ్యక్తి 13 కేజీల 800 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాజేష్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ రెండు కేసుల్లో మరింత దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఎస్ఎస్ఏ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలు, మోటారు యాక్ట్‌పై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి శ్రీధర్, ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

నదిలో జారిపడి వృద్ధుడి మృతి

శ్రీకాకుళం రూరల్: బైరి గ్రామానికి చెందిన గొర్లె రామారావు(70) శనివారం సాయంత్రం ఆరుబయటకు వెళ్లి వంశధార నది వద్ద ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఎవరూ లేకపోవడంతో మునిగిపోయి చనిపోయాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో నదిలో ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరిగాయని, ఆ గోతులే ప్రాణాలు బలిగొంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెంచూరియన్‌లో యోగోత్సవం

పర్లాకిమిడి:

ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, మురార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ (న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో 'యోగోత్సవం- 2025'ను జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, ప్రొఫెసర్ బిశ్వజిత్ మిశ్రా (పరిపాలన), డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాడీ, క్రీడాశాఖ డైరెక్టర్ రబినారాయణ రౌత్రాయ్ తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ దాస్ మాట్లాడుతూ యోగా ద్వారా మనిషి ఆరోగ్యం, జ్ఞానం కలుగుతుందన్నారు. సంపూర్ణ వెల్‌నెస్, నిరంతరం సెంచూరియన్ వర్సిటీకి సహకారం అందిస్తున్నందుకు కలెక్టర్ బిజయకుమార్ దాస్‌కు 'సెంచూరియన్ యోగా మిత్ర' అవార్డును ఉపకులపతి ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్ ద్వారా ప్రదానం చేశారు. యోగాసనాలు చేసిన తరువాత రెండో సెషన్‌లో 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే వర్క్ షాపును ఐఐటీ ధాన్‌బాద్ నుంచి విచ్చేసిన



యోగజ్ఞానంపై మాట్లాడుతున్న అంశు మాలిని


కుండలినీ యోగాపై మాట్లాడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ అజిత్ కుమార్ బెహరా

ప్రొఫెసర్ అజిత్ కుమార్ బెహరా కుండలినీ యోగా గురించి విద్యార్థులకు తెలియజేశారు. భువనేశ్వర్ నుంచి విచ్చేసిన యోగాభ్యాసం కోచ్ అంశుమాలిని యోగా విద్య ద్వారా లాభాలను తెలియజేశారు. యోగా, ధ్యాన నైపుణ్య కోర్సులకు ఫెలిసిటేటర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ పండా, ఐ.కె.ఎస్ బోధకుడు బాలాజీ పాడీ, భువనేశ్వర్ క్యాంపస్ యోగా బోధకుడు డాక్టర్ జ్ఞానేంద్ర కుమార్ మిశ్రా, సెంటర్ కో ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్ సాహులకు జ్ఞాపికలతో డాక్టర్ అనితా పాత్రో అందజేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థి మెహెర్ సచిత్ చేసిన వేద ప్రార్థనలు, భగవద్గీత పారాయణంలో కర్మయోగ పద్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి

భువనేశ్వర్: నయాగడ్ జిల్లాలో శనివారం విషాద సంఘటన వెలుగు చూసింది. శిశిర్ సాహు అనే వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సగం కాలిపోయిన మృతదేహాన్ని నయాగడ్ జిల్లా బారామాసి గ్రామంలో అటవీ శాఖ అధికారి (ఫారెస్టర్) స్వాధీనపరచుకున్నారు. శుక్రవారం రాత్రి పూట నిప్పు అంటించడంతో ఈ ఘటన సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. మృతుడిని నయాగఢ్ జిల్లా పంచరిద ఫారెస్ట్ రేంజ్‌కు చెందిన ఫారెస్టర్ శిశిర్ సాహుగా గుర్తించారు. అతను రెండు నెలల కిందట పంచరిద రేంజ్‌లో ఫారెస్టర్‌గా చేరాడు. రోజు మాదిరిగా శిశిర్ తన భార్య నమిత, కుమారునితో కలిసి నిద్ర పోయాడు. ఇంతలో అర్ధ రాత్రి పూట ఇంట్లో మంటలు చెలరేగాయి. శిశిర్ భార్య అరుస్తూ ఇంటి నుంచి బయటకు వచ్చి ఇరుగు పొరుగు వారి సాయం కోరింది. ఈ సమాచారం అందుకున్న నయాగఢ్ అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. నయాగడ్ టౌన్ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఫారెస్టర్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుగుతోంది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు అస్పష్టంగా ఉండటంతో శిశిర్ సాహు మరణంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. శిశిర్ తనను తాను నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడా ... గిట్టని వారు ఎవరైనా తనపై కక్షతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా ... అనే దిశలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బంధుమిత్రులతో పోలీసులు సంప్రదిస్తున్నారు. భార్య వివాహేతర సంబంధాల అనుమానంతో తరచూ భర్తని వేధించేదని మృతుని బంధువర్గాల ఆరోపణ. ఈ నేపథ్యంలో తరచూ వీరి మధ్య కలహంతో ఇల్లు రణరంగంగా మారేదని తెలిపారు.


సగ కాలిన మృత దేహం
శిశిర్ సాహు

అథ్లెట్లకు అభినందనలు


స్ప్రింటర్ అనిమేష్ కుజుర్


స్ప్రింటర్ శ్రావణి నొందొ

భువనేశ్వర్: దక్షిణ కొరియా గుమిలో జరిగిన 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విశేష ప్రతిభ ప్రదర్శించి పతకాలు సాధించారు. ఏస్ స్ప్రింటర్ అనిమేష్ కుజుర్, శ్రావణి నొందొ ఈ పోటీలో పతకాలు సాధించారు. అనిమేష్ కుజుర్ పురుషుల 200 మీటర్ల పరుగులో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అతి స్వల్పంగా 20.32 సెకన్ల సమయంతో గమ్యం ఛేదించి కొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. గుమిలో జరిగిన తన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో అనిమేష్ కుజుర్ తొలిసారి పాల్గొని కాంస్య పతకం సాధించడం విశేషం. ఫుట్‌బాల్ క్రీడాకారుడి నుంచి ఏస్ స్ప్రింటర్‌గా ఆవిర్భవించి తనదైన శైలిలో అద్భుత ప్రతిభ ప్రదర్శించాడని అతని కోచ్ మార్టిన్ ఓవెన్స్ కొనియాడారు. ఒడిశా స్టార్ స్ప్రింటర్ శ్రావణి నొందొతో కూడిన భారత మహిళల రిలే జట్టు 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025లో 400 మీటర్ల ఈవెంట్‌లో 43.86 సెకన్ల సమయంతో లక్ష్యం ఛేదించి రజత పతకాన్ని సాధించింది. శ్రబాణి, ఎస్. ఎస్. స్నేహ, అభినయ రాజరాజన్, నిత్య గాంధేలతో కూడిన జట్టులో శ్రావణి నొందొ ఒకరుగా పాల్గొని విజయం సాధించింది. దక్షిణ కొరియాలోని గుమిలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించిన శ్రావణి నొందొ, కాంస్య పతకం గెలుచుకున్న అనిమేష్ కుజుర్‌కు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందనలు తెలిపారు.

బీడీవోకు ఘనంగా వీడ్కోలు


బీడీవోను సత్కరిస్తున్న జర్నలిస్టులు

జయపురం.: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి బీడీవో కపిలేశ్వర తండి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు కుంద్ర సమితి పాత్రికేయ సంఘం తరఫున ఘన వీడ్కోలు లభించింది. ఈ సందర్భంగా పాత్రికేయ సంఘ సలహాదారు కనూచరణ నాయిక్ మాట్లాడుతూ బీడీవో కుంద్ర సమితి ఉన్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన కుంద్ర బీడీవోగా వచ్చిన తరువాత సమితిలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అంతేకాకుండా పాత్రికేయులతో మంచి మిత్రునిగా ఉండే వారని, జర్నలిస్టుల సంఘ భవనానికి స్థలం కేటాయించటంలో ప్రధాన భూమిక నిర్వహించారన్నారు. ఆయన కృషివలన తహసీల్దార్ బినోద్ కుమార్ నాయిక్ స్థలం సమకూర్చారని వెల్లడించారు. ఆ స్థలంలో జర్నలిస్టు భవనం నిర్మాణానికిని ఇద్దరు అధికారులు సహకరించారని, బీడీవో తండిని కుంద్ర సమితి పాత్రికేయులు ఎన్నడూ మరవలేరని అన్నారు. బీడీవోను ను సన్మానించిన వారిలో కనూచరణ నాయిక్‌తో పాటు సీనియర్ పాత్రికేయులు అక్షయ కుమార్ పట్నాయక్, జర్నలిస్టులు ఎన్. సంతోష్ కుమార్, రామ చంద్రనాయిక్, ఇంద్ర పంగి, బాబుల హరిజన్, నిరంజన్ పాణి, సురేంద్ర సాగరియ,హరిహర కుమార్ పట్నాయిక్ మొదలగు వారున్నారు.

మైనర్‌పై లైంగిక దాడి చేసిన వ్యక్తి పరార్


పోలీసులు జప్తు చేసిన కారు


జప్తు చేసిన బైక్


జప్తు చేసిన మరో కారు

జయపురం.: పెళ్లి చేసుకుంటానని ప్రలోభ పరచి మైనర్ బాలికను గర్భవతిని చేసిన కొట్‌పాడ్ ఎమ్మెల్యే బొరిగుమ్మ సమితి ప్రతినిధి, బీజేపీ నేత కుమారుడుపై చర్యలకు పోలీసులు ఉపక్రమించారు. నిందితుడు రాజేంద్రభొత్ర ఫరారీలో ఉండటంతో అతడు వినియోగిస్తున్న రెండు కార్లు, ఒక బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడి కుటుంబ సభ్యులను విచారించామన్నారు. అయితే అతడి జాడ తెలియరాలేదని సయపురం సదర్ పోలీసు స్టేషన్ అధికారి సచీంద ప్రధాన్ శనివారం వెల్లడించారు. నిందితుడు బొరిగుమ్మ సమితి సనపొరియ పంచాయతీ సవునిగిడ గ్రామం రాజేంద్ర భొత్ర కు ఒక వివాహం సమయంలో మైనర్ బాలికను చూశారు. అప్పటి నుంచి వారి మధ్య స్నేహం ఏర్పడింది. రాజేంద్ర ఆమెను వివిధ విధాలుగా ప్రలోభ పరచి శారీరకంగా అనుభవించాడు. ఇటీవల బాలిక తనకు కడుపు నొప్పిగా ఉందని తల్లితో చెప్పగా.. ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు ఐదు నెలల గర్భిణిగా తేల్చారు. బాలిక జరిగిన విషయం తల్లికి తెలపగా ఆమె తల్లి గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. గ్రామ పెద్దలు నిందితుడు రాజేంద్రను గ్రామానికి రమ్మని కబురు చేశారు. అయితే రాజకీయ కుటుంబం కావటంతో రాకుండా ఎంతైనా ఇస్తాను కడుపు తీయించుకొమ్మని కబురు చేశారు. మరో మార్గం లేక బాధితురాలి తల్లి జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పోస్కో కేసు నమోదు చేశారు. ఈ సంఘటన రాజకీయ రంగుగా మారింది. బీజేడీ పార్టీ నేత.. మాజీ మంత్రి పద్మిణీ దియాన్ మహిళా కార్యకర్తలతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంటనే నిందితుని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీని కలిసి నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిందితుడి ఇంటికి వెళ్లగా అతను లేకపోవడంతో అతడు వినియోగించే రెండు కార్లు, ఒక బైక్‌ను సీజ్ చేశారు.

కల్యాణం.. కమనీయం


రంగవల్లులతో ఉత్సవ కళ సంతరించుకున్న ఏకామ్ర క్షేత్ర వాకిలి


పరిణయోత్సవ శోభతో ఏకామ్ర క్షేత్రంలో లింగరాజు, పార్వతీ మాత ఉత్సవ మూర్తులు


లింగరాజు దేవస్థానం పుష్ప సోయగం

పవిత్ర శీతల షష్టి పురస్కరించుకుని శనివారం రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో పార్వతీపరమేశ్వరుల పరిణయోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక ఏకామ్ర క్షేత్రవాసుడు లింగరాజు మహాప్రభువు దేవస్థానంలో ఈ ఉత్సవం వేడుకగా చేపట్టారు. ఈ సందర్భంగా ఏకామ్ర క్షేత్రం వాకిలి భారీ రంగవల్లులు, దేవస్థానం ప్రాకారం భారీ పూల మాలలు, మిరమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణతో కళకళలాడింది. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు.

భువనేశ్వర్

వైభవంగా శీతల షష్టి


శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న ప్రముఖులు, భక్తులు

పర్లాకిమిడి: స్థానిక రాజవీధి రామలింగేశ్వర ఆలయం (పొడుగు దేవాలయం)లో శనివారం సాయంత్రం శీతల షష్టి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పర్లాకిమిడి పురవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని అర్చకులు దుర్గాప్రసాద్ దాస్ ఆధ్వర్యంలో జరిపారు. ఈ దేవ కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారులు అంధవరపు బాలజీ, మల్లా శ్రీను దంపతులతో వేద పండితులు వనమాలి మాణిక్యశర్మ జరిపించారు. పొడుగు దేవాలయం ప్రధాన అర్చకులు దుర్గాబాబు, ఇతర అర్చకుల శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆదివారమైనా బాధ్యతలు స్వీకరించాల్సిందే


ఇటీవల హెచ్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖలో ఇటీవల హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఆదివారం విధుల్లో చేరనున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో ఇటీవల 83 మంది స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. వీరికి గత నెల 29న శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్లో సాంకేతిక సమస్యల కారణంగా ఆరోజు ఉదయం 10 గంటలకు మొదలువకావాల్సిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 వరకు మాన్యువల్ విధానంలో పూర్తిచేసిన ఉదంతం విదితమే. కాగా ఆరోజు హెచ్‌ఎంలగా పదోన్నతి పొందిన వారంతా ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించి, విధుల్లో చేరాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ఈ 83 మందిలో జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లో 80మంది, మున్సిపల్ ఇద్దరు, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒకరు ఉన్నారు. వీరంతా శనివారం పాత పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యారని డీఈఓ తిరుమల చైతన్య పేర్కొన్నారు.

అవగాహనే ఆయుధం : సీఎం

భువనేశ్వర్: పొగాకు సంబంధిత వైపరీత్యాల నివారణకు అవగాహన ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. పొగాకు వ్యతిరేకత కార్యకలాపాల సాఫల్యత అంతర్ విభాగ సమన్వయంతో సాధ్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ప్రధాన కార్యదర్శి ఎస్.అశ్వస్థి తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్‌టీసీపీ) కింద ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్థానిక గీత గోవింద సదన్‌లో రాష్ట్ర స్థాయి ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం 2025ను కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పొగాకు రహిత ఒడిశాకు తమ మద్దతును తెలుపుతూ పౌరులు పాల్గొనేలా సంతకం ప్రచారాన్ని ప్రారంభించారు. పొగాకు వాడకంతో సంబంధం ఉన్న నష్టాలపై ప్రజలకు, ముఖ్యంగా యువత, దుర్బల వర్గాలకు అవగాహన కల్పించడానికి శాఖ రూపొందించిన సమాచార విద్య సంచిక (ఐఈసీ), 2024-25 వార్షిక కార్యాచరణ నివేదికను ఆరోగ్య శాఖ విడుదల చేసింది. కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలు జాతీయ పొగాకు రహిత మార్గదర్శకాలపై స్వీయ అవగాహన కోసం పొగాకు రహిత విద్యా సంస్థలు వెబ్ డిజిటల్ అప్లికేషన్ ప్రారంభించారు. పొగాకు నియంత్రణ చొరవలను ఆదర్శప్రాయంగా అమలు చేసిన 3 జిల్లాలను అభినందించారు. ఎన్‌టీసీపీ సమగ్రంగా అమలు చేసినందుకు గంజాం, పొగాకు నియంత్రణ చట్టాన్ని అమలు చేసినందుకు సుందర్‌గఢ్, ఈ కార్యక్రమం కింద సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ కోసం కటక్ జిల్లాలు ప్రత్యేక బహుమతులు అందుకున్నాయి. పొగాకు వ్యతిరేక కార్యకలాపాల్లో అనుబంధ మద్దతుకు గుర్తింపుగా పాఠశాల, సామూహిక విద్య, ఉన్నత విద్య, అబ్కారి, పంచాయతీ రాజ్, తాగు నీరు, హోం శాఖ 5 విభాగాలకు అవార్డులు ప్రదానం చేశారు. రాష్ట్ర ప్రజారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ జె. ఎం. బబోర్త, డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా, ఎన్‌టీసీపీ అదనపు డైరెక్టర్ మరియు రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సుశాంత కుమార్ స్వంయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పొగాకు నివారణలో ఉత్తమ సేవలకు పురస్కారం ప్రదానం


పొగాకు వ్యతిరేక దినోత్సవంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

క్లుప్తంగా

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.4.90 లక్షల జరిమానా



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి రూ.10వేల జరిమానా విధిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 49 మందిపై ఒక్క రోజులోనే కేసులు నమోదు చేసి విజయగరం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి ఒకొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం 49 మందికి రూ.4.90 లక్షల జరిమానా విధించారని ఎస్పీ తెలిపారు.

ప్రశాంతంగా ఎస్‌జీటీల కౌన్సెలింగ్



బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సెలింగ్ శనివారం జరిగింది. ఎస్‌జీటీ 37, ఎల్‌పీ తెలుగు, ఎల్‌పీ హిందీ పోస్టులు ముగ్గురికి చొప్పున బదిలీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవి, జీసీడీవో రాములమ్మ, హెచ్ఎంలు పి.నారాయుడు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ డిపోల వద్ద సరుకులు



సిబ్బందితో మాట్లాడుతున్న జీసీఎంఎస్ మేనేజర్ సాంబశివరావు

పార్వతీపురం టౌన్: నేటి నుంచి రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీ చేయనున్నట్టు జీసీసీ మేనేజరు ఎం.సాంబశివురావు అన్నారు. ఈ మేరకు శనివారం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీసీఎంఎస్ బ్రాంచి పరిధిలో 17 డిపోల సేల్స్‌మెన్స్, గోదాముల సూపర్‌వైజరల్ ఆదివారం నుంచి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు తెరిచి వుంచాలన్నారు. వినియోగదారులకు ఇటువంటి అసౌకర్యాలు కలగకుండా పంపిణీ చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. జీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా..



బోల్తా పడిన ఆటో

శృంగవరపుకోట: మండలంలోని గిరిశిఖర పంచాయతీ ధారపర్తి పరిధిలో పల్లపు దుంగాడ నుంచి దబ్బగుంటకు వెళ్తున్న ఆటో బోల్తా పడింది. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే ఈ సమయంలో ఆటోలో ప్రయాణికులెవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో నుజ్జుయిన ఆటో

విజయనగరం క్రైమ్: నగరంలోని పూల్‌బాగ్ రోడ్డులో అయ్యప్పస్వామి గుడి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చీపురుపల్లి నుంచి విజయనగరం వస్తున్న కారు పూల్‌బాగ్ రోడ్డులో అయ్యప్పస్వామి గుడి వద్ద వెనుక నుంచి వస్తూ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో రావివలస పంచాయతీకి చెందిన ఆటో డ్రైవర్ రామకృష్ణ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టు టౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా పెంచి మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలి

- క్యూఆర్ కోడ్‌తో సమాచారం
- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిఘా అధికం చేయడం మాత్రమే కాకుండా వాహనాలను ఆకస్మిక తనిఖీలను చేపట్టడం వలన మరింత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో మున్సిపాలిటీలు కనీసం 5వందల సీసీ కెమెరాలు సమకూర్చాలని ఆయన అన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు 1972 టోల్ ఫ్రీ నంబరుకు అందించాలని కోరారు. ఆర్టీసీ బస్సులలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి వివరాలతో అవగాహన పోస్టర్లను పెట్టాలన్నారు. అటవీ శాఖ అధికారులు ఆధునిక పరిజ్ఞానంతో అటవీ ప్రాంతంలో జరిగే మాదకద్రవ్యాల నియంత్రణ కార్యక్రమంలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

క్యూఆర్ కోడ్‌లతో సమాచారం

క్యూఆర్ కోడ్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి మాదక ద్రవ్యాల సమాచారంపై ప్రజల స్పందన కూడా తెలుసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ మేరకు 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 7841 మంది ప్రజలు పాల్గొని స్పందన అందించారన్నారు. డ్రోన్ సర్వేలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు స్వయం రక్షణ పద్ధతులు నేర్పించడం, పాఠశాలల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్బులను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. జనవరి నుంచి మే వరకు మాదక ద్రవ్యాలకు సంబంధించి 11 కేసులను నమోదు చేశామని, ఇందులో 1875 కేజీల గంజాయి రవాణా చేయడం జరిగిందన్నారు. రవాణా శాఖ అధికారి ఎం.శశికుమార్ మాట్లాడుతూ రవాణా శాఖ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుందని, 199 కేసులను బుక్ చేయడం జరిగిందని చెప్పారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో నవోదయం రెండవ దశ పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. 27 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించామన్నారు.

సంయుక్తంగా దాడులు

ఆంధ్రా – ఒడిశా అధికారులు సంయుక్తంగా దాడులను నిర్వహించడం జరిగిందని, ఇందులో 50 వేల ఐదు వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. సారా తయారీకి సహకరిస్తున్న 64 మంది బెల్లం వ్యాపారులను గుర్తించామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ఏఎస్పీ అంకిత సురాన, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి గయా జుద్దీన్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం వినోద్, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, అటవీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విక్రంపురంలో గంజాయి కలకలం..!

- తొమ్మిదేళ్ల బాలుడిపై దాడి



మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మత్తులో చిందులు వేస్తున్న యువకుడు

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామ సచివాలయం, జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాల పరిసరాల్లో మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మండల పరిషత్ పాఠశాల వద్ద కొందరు యువకులు మద్యంతో పాటు గంజాయి సేవిస్తూ గ్రామస్తులకు పట్టుబడ్డారు. సిరిపురం గౌతమ్ అనే యువకుడు తొమ్మిదేళ్ల బాలుడిపై గంజాయి మత్తులో దాడి చేశాడు. బాలుడి కుటుంబ సభ్యులు గౌతమ్‌ను ప్రశ్నించగా వారిపై ఇటుక రాళ్లతో దాడికి దిగాడు. దీనిపై ఆరా తీయగా ఆ యువకుడు తెల్లవారి నుంచే మద్యంతో పాటు గంజాయి సేవిస్తూ ఇష్టారాజ్యంగా గ్రామంలో తిరుగుతూ ఎవరు ప్రశ్నిస్తే వారిపై దాడి చేయడం అలవాటైందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ యువకుడితో పాటు గ్రామానికి చెందిన పలువురిని గంజాయికి బానిస చేస్తున్నాడని యువత తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా గౌతమ్ ఆగడాలు గ్రామంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయని పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా బాలుడి తల్లిదండ్రులు ఈ విషయమై పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

విధుల్లో అంకితభావంతోనే గుర్తింపు : ఎస్పీ



పదవీ విరమణ పొందిన ఎస్ఐకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీసు శాఖలో ఉన్నతాధికారులు వివిధ రూపాల్లో తమ విధుల్లో నైపుణ్యత చూపి చేసిన సేవలు చిరస్థాయిగా పలువురికి ఆదర్శంగా, ఆచరణీయంగా ఉంటూ పదిలంగా ఉంటాయని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. తన కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన మెట్ట సుదర్శన వెంకటప్రసాద్‌ను శనివారం ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 40ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించి, శాఖపై ప్రజలకు మరింత భరోసా కల్పించిన వారి గుర్తింపు చిరస్థాయిగా ఉంటుందని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ వారి కుటుంబానికి అవసరమైనపుడు ఆదుకొనేందుకు సిద్ధంగా ఉంటుందని అన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్ఐకు ఎస్పీ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఎస్పీ ఎస్ఐ దినకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ వివరాలపై ప్రతీ నివేదిక అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అంబేడ్కర్

- జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: స్కానింగ్ కేంద్రాల్లో ప్రతి రోజూ ఎన్ని స్కానింగ్‌లు జరుగుతున్నాయనే అంశంపై ప్రతీ రోజు నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజు వారీగా జరుగుతున్న ప్రసవాలను నమోదు చేసి ఆయా ఆసుపత్రుల నుంచి ప్రతి రోజు సమాచారం సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగిన గర్భస్రావాల సమాచారం కూడా వెంటనే అందజేయాలన్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల సమాచారాన్ని వెంటనే ఒక నివేదిక రూపంలో అందజేయాలన్నారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లోనూ లింగ నిర్ధారణ సమాచారం తెలియజేయడం జరగదనే బోర్డులు సందర్శకులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు ఆయా ఆసుపత్రులు వసూలు చేసే చార్జీల వివరాలతో కూడిన ధరల పట్టికను కూడా బోర్డుల రూపంలో ప్రదర్శించే ఏర్పాట్లు చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో నియంత్రణ ఉండాలని స్పష్టం చేశారు. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు తనిఖీ చేసిన నివేదిక ఇచ్చిన తర్వాతే వాటికి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవన రాణి, డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ సుబ్రమణ్యం, డీఐవో డాక్టర్ ఆర్, అచ్యుతకుమారి, డీపీహెచ్‌ఎన్‌వో సత్యవతి, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



సీతారామరాజును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజు ఇటీవల ఇంట్లో ప్రమాదవశాత్తూ పడిపోయి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజ్జి శ్రీనివాసరావు శనివారం గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా సీతారామరాజుతో మాట్లాడుతూ.. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి వేధింపులపై పెళ్లికుమార్తె ఫిర్యాదు

విజయనగరం క్రైమ్: ఆమెకు ఈ నెల 5వ తేదీన వివాహం జరిపేందుకు పెద్దలు నిశ్చయించారు. ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. గతంలో తను పనిచేసే షాపులో సహోద్యోగి తనను పెళ్లిచేసుకోవాలంటూ స్నేహితులతో కలిసి శనివారం రాత్రి ఇంటివద్ద గొడవచేశారు. దీనిపై తల్లిదండ్రులతో కలిసి విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెళ్లికుమార్తె శనివారం ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ మీనాక్షి కేసు నమోదు చేశారు. స్థానికంగా ఉన్న ఓ షాపులో తనతో కలిసి వీటీ అగ్రహారానికి చెందిన అబ్బాయి పనిచేసేవాడని, దానిని అనువుగా తీసుకుని పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్ఐ మీనాక్షి దర్యాప్తు చేపట్టారు.

బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

పార్వతీపురం: బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ అన్నారు. పట్టణంలో సౌందర్య థియేటర్ రోడ్డులో బాల్య వివాహాలను నిర్మూలించడానికి, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రజలకు మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రచార రథాన్ని శనివారం ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ కోసం ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందన్నారు. బాలల హక్కుల రక్షణ మిషన్(ఎన్‌సీపీసీఆర్), రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్(ఎస్‌సీపీసీఆర్) గూర్చి ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచార రథం బాలల హక్కుల రక్షణ కోసం ఒక అవసరమైన సాధనంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీపీవో అల్లు సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ నివారణకు చర్యలు : పీవో



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో మలేరియా, డెంగీ కేసులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ కేసులు ఉండరాదని, వాటి నివారణకు పూర్తి చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఐఎంఆర్, ఎస్ఎంఆర్ మరణాల రేటును తగ్గించేలా జాగ్రత్తలు తీసుకోవాలని పీవో తెల్పి చెప్పారు. ఈ విషయంలో వైద్యాధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, ఉప జిల్లా వైద్యశాఖాధికారి కేపీఎస్ పద్మావతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎం.వినోద్‌కుమార్, ఐటీడీఏ పరిధిలో వున్న మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు శిక్ష..

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామ సమీపంలో జాతీయ రహదారి 26పై నిర్లక్ష్యంగా లారీ నడిపి ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతికి కారణమైన లారీ డ్రైవర్ వై. శ్రీనివాసరావుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి శనివారం తీర్పు చెప్పారని ఎస్సై యు. మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమాన విధించారని పేర్కొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సవరమ్మ

- విజయనగరం ఆర్డీవో టి.సవరమ్మ

విజయనగరం అర్బన్: పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని విజయనగరం ఆర్డీవో టి.సవరమ్మ ఆదేశించారు. తన కార్యాలయంలో డివిజన్ జంతు సంక్షేమ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లొట్లపల్లి, మోపాడ జంతువులు మరియు పశువుల సంతల్లో పశువులను హింసాత్మకంగా అక్రమ రవాణా జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంతకు లైసెన్స్ లేకపోయిన అక్రమంగా సంత నిర్వహిస్తున్నట్టు దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ విజయనగరం పట్టణంలో పశువధశాల లేకపోయినా పశు మాంస వ్యాపారాలు చేసుకునేందుకు లైసెన్స్‌లు ఇచ్చిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గో సంరక్షణ క్యాలెండర్‌ను ఆర్డీవో ఆవిష్కరించారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఆరికతోట మోహనరావు, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మారావు, పి.అనురాధ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్‌రావు, డివిజన్ పరిధిలో మండలాధికారులు, గో సంరక్షణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి


- మృతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన గిరిజనులు



గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన అప్పన్న, రమేష్

పార్వతీపురం రూరల్: మండలంలోని డీకే పట్నం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పీడిక అప్పన్న (55), ఊయక రమేష్ (25) మృతి చెందారు. మృతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు. ఈ ప్రమాదానికి సంబంధించి పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సందివలస గ్రామానికి చెందిన పీడిక అప్పన్న అల్లుడు వరుసైన ఒడిశాలోని కార్లి గ్రామానికి చెందిన రమేష్‌తో ద్విచక్ర వాహనంపై సంధివలస నుంచి సొంత పనుల నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుర్తు తెలియని వాహనం డీకే పట్నం సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలం వద్ద రమేష్ మృతి చెందగా, జోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ పీడిక అప్పన్న మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు ఆమె తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం



బోల్తాపడిన నూర్పిడి యంత్రం

వంగర: మండల పరిధి మగ్గూరు కూడలి వద్ద శనివారం పెనుప్రమాదం తప్పింది. వరి నూర్పిడి అనంతరం కళ్లం నుంచి గ్రామంలోకి తీసుకువస్తున్న నూర్పిడి యంత్రం ఒక్కసారిగా బోల్తాపడింది. దీనిపై కూర్చున్న వేతనదారులు ప్రమాదాన్ని అంచనా వేసి దూకేయడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రోడ్డుపై బోల్తాపడిన నూర్పిడి యంత్రాన్ని జేసీబీ సహాయంతో సరిచేశారు.

‘గురుదేవా’లో చోరీ ఇంటిదొంగల పనేనా..?

- ఇప్పటికే అదుపులో ఐదుగురు అనుమానితులు



కొత్తవలస పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గురుదేవా చారిటిబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష బాబు ఇంట్లో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఇంటి దొంగలే చోరీకి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ దొంగతనం జరిగిన ఇంటి పూజా గది, పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో రెండున్నర గంటల పాటు చర్చించి పలు సూచనలు చేశారు. దొంగతనం జరిగిన ఇంటి ముందు ఉన్న సీసీ కమెరా దొంగతనం జరిగిన రోజు సాయంత్రం 6 గంటలకు ఆగిపోవడం, కెమెరాకు సంబంధించిన వైరు తెగిపోయి ఉండడాన్ని చూసి.. అక్కడ నుంచే దర్యాప్తును ప్రారంభించారు. ట్రస్టులో పని చేస్తున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారణ జరపగా చోరీ చేసిన తీరును తెలిపినట్టు సమాచారం. చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. చోరీ అంతా ట్రస్టులో పనిచేసే ఒక బిగ్‌బాస్ ఆధ్వర్యంలో జరిగినట్టు అనుమానిస్తున్నారు. ఏఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం శనివారం సాయంత్రం మరింత లోతుగా దర్యాప్తు చేసింది.

అసలు చోరీకి గురైన బంగారం ఎంత?

జగదీష్‌బాబు ఇంట్లో జరిగిన చోరీలో ఎంత మొత్తంలో బంగారాన్ని దొంగలు అపహరించుకుపోయారనే విషయంలో స్పష్టతలేదు. పోలీసులు మాత్రం కేవలం 90 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు పోయినట్టు కేసు నమోదు చేశారు. వాస్తవానికి అంతకు 10 రెట్లు బంగారం, పెద్ద మొత్తంలో నగదును దోచుకుపోయారన్న వాదన వినిపిస్తోంది. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తును పర్యవేక్షించడం ఈ వాదనకు బలం చేకూరుతోంది.

భయం..భయం



గొట్టివలసలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: ఏనుగుల సంచారంతో గరుగుబిల్లి మండలంలోని నందివానివలస, సుంకి, సంతోషపురం, గొట్టివలస గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్లపైన, గ్రామానికి సమీపంలో సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ ముప్పు తలపెడుతాయోనని భయపడుతున్నారు. తక్షణమే ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పండగ దృష్ట్యా వాహనాల దారి మళ్లింపు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ తల్లి గ్రామ దేవతల పండగలను పురస్కరించుకొని భక్తుల రద్దీ దృష్ట్యా జూన్ 3 మంగళవారం సిరిమానోత్సవం రోజున సాయంత్రం 5గంటల నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు భారీ వాహనాలను జిల్లా కేంద్రానికి ఇరువైపులా సరిహద్దు ప్రాంతాలైన నర్సిపురం, అర్తాం గ్రామాల సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై రాకపోకలు చేసే వాహనాలను నిలిపివేస్తున్నట్టు పట్టణ సీఐ కె.మురళీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను పార్వతీపురం బైపాస్ రోడ్డు మీదుగా పాలకొండ వెపు వెళ్లే వాహనాలను, అలాగే రాయగడ వైపు వెళ్లే వాహనాలను చంద్రంపేట, కొత్తవలస మీదుగా మళ్లించేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఆయన తెలిపారు. సిరిమానోత్సవం సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి లోపలకు వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు బైపాస్ మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు. అలాగే సిరిమాను తిరిగే వీధుల్లో ఇళ్లముందు వాహనాలను పార్కింగ్ చేయకూడదని సీఐ సూచించారు.

ప్రజలకు మంచి జరగాలి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట పంచాయతీ గుమ్మిడివరం గ్రామస్తులు నిర్మించుకున్న సీతారాముల వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు దర్శించుకుని ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని పూజలు చేసినట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. గుమ్మిడివరంలో నిర్మించుకున్న సీతారాముల ఆలయ నిర్వాహకులు పిలుపు మేరకు శనివారం ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రామాలయంలో జరిగిన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో తనకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అక్కపోలు సింహాచలం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.